క్లుప్తంగా

రేషన్ పంపిణీ యథాతథం

శిరివెళ్ల: రేషన్ పంపిణీ ఎండీయూ వాహనాల ద్వారా యథాతథంగా పంపిణీ చేస్తారని తహసీల్దార్ కులశేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల కోడ్, రేషన్ పంపిణీపై వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనాలపై రాజకీయ నాయకులు బొమ్మలు లేకుండా చూడాలని సూచించారు. పంపిణీలో వలంటీర్ల సహాయం తీసుకోవద్దని ఆదేశించారు. నియమావళి, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గ్రామాలకు తనిఖీలకు వస్తుంటారన్నారు. వారందరికీ అందుబాటులో ఉండి సహకరించాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో 85 సంవత్సరాలు దాటిన, ఉన్న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు 116 మంది ఉన్నారని, వారికి ఎన్నికల నామినేషన్ దాఖలు ప్రక్రియ మొదలు కాగానే దరఖాస్తులు అందజేస్తామని తెలిపారు. ఆర్ఐ సుచరిత పాల్గొన్నారు.

ముగిసిన పన్ను వసూళ్లు

నంద్యాల(సిటీ): ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ మాఫీతో పన్ను వసూళ్లు ఆదివారం ముగిశాయని, వడ్డీ మాఫీతో ప్రజలకు మంచి జరిగిందని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల పట్టణాభివృద్ధికి సహకరించే గృహ, ఆస్తి పన్ను వసూళ్లకు సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. 2023–24వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పట్టణంలోని 48,308 అసెస్మెంట్లకు సంబంధించి రూ.22.71 కోట్ల మేర డిమాండ్ ఉండగా రూ.16.27 కోట్లతో 71.60శాతం వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బందికి, ప్రజలకు అభినందనలు తెలిపారు.

అనుమతులు లేకుండా చేపల వేట

నంద్యాల(అర్బన్): మండలంలోని మేజర్ పంచాయతీ అయిన కానాల గ్రామంలోనున్న నాగమ్మ చెరువులో మత్స్యశాఖ అధికారుల అనుమతులు లేకుండా సొసైటీ సభ్యులు చేపల వేట ప్రారంభించారు. చలానా చెల్లించి చేపల వేట సాగిస్తున్నామని సభ్యులు తెలిపారు. చలానా చెల్లించినా సంబంధిత శాఖ అధికారులు అనుమతులు ఇచ్చిన తర్వాతనే వేట ప్రారంభించాలని నిబంధనలు ఉన్నా వేటను కొనసాగిస్తున్నారు. ఎఫ్‌డీఓ పామన్నను వివరణ కోరగా.. చలానా చెల్లించినా తమ శాఖ నుంచి సభ్యులకు అనుమతులు రాలేదని, వేట నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి


ఎన్జీఓ కాలనీలోని శ్రీజననీ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌లో తనిఖీలు చేస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు

నంద్యాల(సిటీ): నంద్యాల జిల్లా పరిధిలోని ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, ఖాసీం వలి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎన్జీఓ కాలనీలోని శ్రీజననీ, పొన్నాపురంలోని శ్రీచంద్ర ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్, లలితానగర్‌లోని హెచ్‌టూఓ ప్లాంట్లను రీజనల్ పబ్లిక్ లేబొరేటరీ అనలిస్ట్ ఉత్తప్ప ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఆయా వాటర్ ప్లాంట్లలోని లూజ్ వాటర్‌ను కర్నూలు పబ్లిక్ లేబొరేటరీకి, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్యాకెట్లను హైదరాబాద్ స్టేట్ ఫుడ్ సేఫ్టీ లేబొరేటరీకి పంపారు. నిబంధనలు పాటించని వారిపై ఉన్నతాధికారుల నివేదికల మేరకు చర్యలు ఉంటాయని చెప్పారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

బీజేపీ పార్లమెంట్ కో ఆర్డినేటర్ నియామకం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా బీజేపీ పార్లమెంట్ కో ఆర్డినేటర్‌గా అభిరుచి మధును నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తాను ప్రస్తుతం అసెంబ్లీ కన్వీనర్‌గా కొనసాగుతున్నానని, అధిష్టానం అదనపు బాధ్యతలు అప్పగించిందని చెప్పారు.

మజ్జిగ కేంద్రం ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నాగులకుంట రోడ్డులో అహోబిలం స్వాతి గ్రూపు వైశ్య సహాయ వారధి మిత్రుల సహకారంతో ఆంధ్రప్రేమ్ వర్కర్స్ కార్యాలయంలో సోమవారం మజ్జిగ కేంద్రాన్ని జగన్నాథ మందిరం నరసింహదాసు ప్రారంభించారు. నరసింహదాసు మాట్లాడుతూ వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతల బారి నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ఉచిత మజ్జిగ, మంచినీరు దాతల సహకారంతో పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు గోపాల్, మధు, సత్య, తేజ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఈ చిత్రంలో ఉన్న బాలుడి పేరు ఎద్దుల నరసింహుడు. రుద్రవరం మండలంలోని ఆర్.నాగులవరం గ్రామ వాసి. పుట్టుకతోనే నరాల బలహీనత.. ఫలింతగా నడవలేని పరిస్థితి. కొద్ది దూరం అయితే జోగుతూ వెళ్లగలడు. అలాంటి దివ్యాంగుడికి వలంటీర్ ప్రతి నెలా ఇంటి వద్దకు వెళ్లి బొటన వేలి గుర్తు పడటం అలస్యమైనప్పటికీ ఓపికగా గుర్తు పడే వరకు ఉండి పింఛన్ సొమ్ము అందించేవాడు. ఆ సొమ్ముతోనే ఆ కుటుంబం జీవనం సాగిస్తుంది. ఇప్పుడు వలంటీర్లు పింఛన్ అందజేయరాదని చెబుతున్నారు. పద్ధతిలా.. కుటుంబ సభ్యులు గ్రామ సచివాలయం వద్దకు వెళ్లాలంటున్నారు..అక్కడ తమ వాడి ముద్ర పడటం ఆలస్యమైతే సిబ్బంది అంతసేపు నిరీక్షిస్తారా, ముందు అంత దూరం ఎలా తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఈమె పేరు సత్తిగారి లక్ష్మీదేవి. ఉయ్యాలవాడ మండలం ఆర్.జంబులదిన్నె గ్రామం. వితంతు పింఛన్ తీసుకుంటుంది. 'నాకు వయసైంది.. నడవలేను. ఇన్నాళ్లు జగన్ పుణ్యమా అని మాకు వలంటీర్ ఇంటికే వచ్చి పింఛన్ ఇచ్చాడు. ఇప్పుడు చంద్రబాబు మా మీద కక్ష గట్టి మళ్లీ మమ్మల్ని ఎండలో తిప్పాలని కుట్ర పన్నాడు. మాలాంటి చేతగాని వాళ్లకు సేవ చేస్తే రాజకీయం చేయడం ఏంటి? మీరు..మీరు ఎన్నైనా చేసుకోండి.. మాలాంటి అసక్తులపైన కుట్రలు చేయకండి. ఇప్పుడు సచివాలయం వెళ్లి పింఛన్ తీసుకోవాలంటున్నారు. అంత దూరం ఎలా నడిచి వెళ్లాలి. అసలే ఎండలు మండిపోతున్నాయి. మళ్లీ మంచం పడితే మాకు చేసేవారు ఎవరు? మమ్మల్ని కష్టపెడితే ఆ ఉసురు మీకు తగులుతుంద'ని ఆగ్రహం వ్యక్తం చేసింది.

కుట్రతో కష్టపెట్టొద్దు

- పింఛన్ల పంపిణీ విధుల నుంచి వలంటీర్ల తొలగింపు
- గత నెల వరకు ప్రతి నెలా తెల్లవారు జామున ఇంటికెళ్లి అందజేత
- టీడీపీ కుట్రతో ఈ నెల నుంచి పంపిణీ చేయరాదని ఈసీ ఆదేశం
- సచివాలయ కార్యాలయాల్లో తీసుకోవాలని సూచన
- మళ్లీ పాత రోజులు తెస్తున్నారని లబ్ధిదారుల మండిపాటు
- దివ్యాంగులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎలా రాగలరని ప్రశ్నిస్తున్న వైనం

సాక్షి నెట్‌వర్క్: సంక్షేమ పథకాలు పేదలకు సక్రమంగా అందుతుండటంతో జగన్‌కు మంచి పేరు వస్తుందని టీడీపీకి కన్నుగుట్టింది. ఎలాగైనా పథకాల అమలును అడ్డుకోవాలని తన వ్యక్తులతో కుట్రకు తెరతీసింది. పథకాల అమలులో కీలకంగా వ్యవహరిస్తున్న వలంటీర్లను విధులను తప్పించేలా కార్యాచరణ రూపొందించి ఎట్టకేలకు విజయం సాధించారు. కాగా.. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులు, మంచంపైనున్న వారు, మహిళలు, మానసిక వికలాంగులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పింఛన్ పంపిణీ చేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను రూపొందించారు. ప్రతి నెల పింఛన్ల పంపిణీలో వలంటీర్లు తెల్లవారుజామునే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సొమ్ము అందజేసేవారు. ఇలాంటి వ్యవస్థ సేవలకు ఇతర రాష్ట్రాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నా చంద్రబాబుకు మాత్రం మొదటి నుంచి నచ్చడం లేదు. ఎలాగైనా అడ్డుకోవాలని కుతంత్రాలు పన్నాడు. చివరకు ఎన్నికల కమిషన్ పింఛన్ పంపిణీలో వలంటీర్లు పాల్గొనరాదని ఆదేశించింది. అలాగే పింఛన్ సొమ్మును సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాలకు వెళ్లి తీసుకోవాలని సూచించింది. అయితే నడవలేని, చేతగాని, మంచంపైనున్న తాము ఎలా వెళ్లగమని పలువురు లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. తమకు జీవనాధారమైన పింఛన్లపై రాజకీయం చేయొద్దని, తమను కష్టపెట్టొద్దని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కడుపులు కొట్టేందుకే చంద్రబాబునాయుడు కుతంత్రాలకు తెరతీసి వలంటీర్లను విధుల నుంచి తప్పించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము ఇన్నాళ్లు వ్యయప్రయాసలు లేకుండా పింఛన్ పొందామని ఇప్పుడు తమకు అంత శక్తి లేదని, పంచాయతీ కార్యాలయాలకు ఎలా వెళ్లి పింఛన్ తెచ్చుకుంటామని ప్రశ్నిస్తున్నారు.

వలంటీర్ తోడ్పాటు మరువలేం



మండల కేంద్రంలోని 2వ సచివాలయ పరిధిలోనున్న 5వ వార్డులో నివాసం ఉంటున్నాం. నేను దివ్యాంగుడను కావడంతో వలంటీర్ సిద్ధిఖ్ ప్రతి నెల 1వ తేదీన ఇంటికొచ్చి పింఛన్ సొమ్ము అందజేసేవాడు. అలాగే రేషన్ కూడా మోసుకొచ్చి ఇస్తాడు. కరోనా సమయంలో నేను ఇంటి నుంచి బయటకు వెళ్లలేక పోయా. ఆ సమయంలో వలంటీర్ మాకు అవసరమైన సరుకులు, మాత్రలు, మంచి నీరు కూడా తెచ్చిచ్చాడు. సొంతవాళ్లే చేయని కాలంలో వలంటీర్ ఇవన్నీ చేయడం సంతోషం కదా. అలా ఆపదలో అండగా ఉన్నవారిని సేవలకు దూరం చేయడం సరికాదు. ఇలాంటి వాటిపై రాజకీయాలు చేయకండి. మమ్మల్ని ఇబ్బందులు పెడితే మీకేం వస్తుంది. అసహాయ స్థితిలో ఉన్నాం. కుట్రలతో కష్టాలు పెట్టొద్దండి.
– మక్తుంసా గారి మాబు, చాగలమర్రి

చంద్రబాబు కన్నుపడితే మాకు కష్టాలే



టీడీపీ పాలనలో పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయలేదు. అప్పట్లో పొద్దున్నే పంచాయతీ ఆఫీసు వద్దకు వెళ్తే అధికారులు మాత్రం మధ్యాహ్నం వచ్చే వాళ్లు. కొందరికి పింఛన్లు ఇచ్చి వెళ్లిపోయేవారు. ఇలా పింఛన్ కోసం వారం పాటు తిరగాల్సి వచ్చేది. అయితే వైఎస్ జగన్ వచ్చాక మాకు వలంటీర్లు ప్రతి నెల ఒకటో తేదీన ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చేవాడు. బాధలు తప్పాయని సంతోషంగా ఉన్నాం. ఎన్నికలు వచ్చాయో లేదో మళ్లీ చంద్రబాబు కుట్ర చేశాడు. మేం సంతోషం ఉండటం ఆయనకు ఇష్టం లేదేమో. ఎవరికో చెప్పి వలంటీర్లను తప్పించారట. ఇదేం న్యాయం. మేం కష్టడుతుంటే మీకు సంతోషంగా ఉంటుందా. – రాములమ్మ, నూనెపల్లె, నంద్యాల

వ్యాపారులపై దాడులు సరికాదు

నంద్యాల(న్యూటౌన్): కోడ్ పేరుతో పట్టణంలో వ్యాపారులపై దాడులు చేసి భయాభ్రాంతులకు గురి చేయడం, సొమ్మును తీసుకెళ్లడం సరికాదని సీపీఎం పట్టణ కార్యవర్గ సభ్యులు మహమ్మద్‌గౌస్, వెంకటలింగం అన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పండుగల సందర్భంగా వ్యాపారాలు ముగించుకొని డబ్బులు ఇంటికి తీసుకెళ్లే సమయంలో దాడి చేసి ఉన్న సొమ్మును సీజ్ చేయడం సమంజసం కాదన్నారు. సీజ్ చేసిన నగదును వెనక్కి ఇచ్చేలా జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ధార్మికోపన్యాసాలు

ఉయ్యాలవాడ : మండలంలోని అల్లూరు గ్రామంలో మంగళవారం నుంచి ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం అల్లూరులోని జనార్దన స్వామి ఆలయ ఆవరణలో ధర్మ ప్రచార కరపత్రాలను భక్తులతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతపై మద్దయ్య స్వామితో ధార్మిక ప్రవచనాలు, గోపూజ, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.మాజీ సర్పంచ్ ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, బుడ్డా శివమోహన్ రెడ్డి, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం


ముత్యాలపాడులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న గంగుల అవంతిక

చాగలమర్రి: సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి సోదరి గంగుల అవంతిక కోరారు. సోమవారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో అడ్వకేట్ సరిత, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్, సుబ్బారాయుడుతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా గంగుల బిజేంద్రారెడ్డి, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, జగదీశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ కొండంపల్లి మస్తాన్, అంకాల్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటరాముడు యాదవ్, సర్పంచ్ శంకరమ్మబాయి, ఉప సర్పంచ్ ఓబులేసు, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మరోసారి సంక్షేమాన్ని గెలిపిద్దాం


కామినేనిపల్లెలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి సతీమణి గంగుల సారికారెడ్డి

శిరివెళ్ల: జగనన్న అందజేసే పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే తన భర్త ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డిని మరోమారు గెలిపించాలని ఆయన భార్య గంగుల సారికారెడ్డి కామినేనిపల్లెలో సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. గ్రామానికి చేరుకున్న ఆమెకు సర్పంచు మేరువ చిన్న నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆమె ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను, గ్రామస్తులకు చేకూరిన లబ్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఐదేళ్ల జగనన్న పాలనలో నవరత్నాల ద్వారా గ్రామస్తులు రూ.5.90 కోట్లు, రైతు భరోసా కింద మరో రూ.1.94 కోట్ల గ్రామస్తులు లబ్ధిపొందారన్నారు. గ్రామంలో రూ. కోటి వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారని చెప్పారు. ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, కోశాధికారి వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్టి, కోటపాడు సర్పంచు దూదేకుల ఉశేన్‌బీ, నాయకులు మేర్వ సాంబిరెడ్డి, సత్తార్ జయానందరెడ్డి, మోహన్‌రావు, శిరిగిరి నారాయణరెడ్డి, సుబ్బరాయుడు, యాకోబు, నాగేశ్వరరెడ్డి, వెంకట రామిరెడ్డి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

మహానందిలో శ్రీశైలం ఈఈ పూజలు

మహానంది: శ్రీశైలం దేవస్థానం ఈఈ రామకృష్ణ, డీఈ సుబ్బారెడ్డి సోమవారం మహానందికి వచ్చారు. వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో వారికి వేదపండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

హోరాహోరీగా పాలబండలాగుడు పోటీలు

కొత్తపల్లి: మండలంలోని ఎం.లింగాపురం గ్రామంలో ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని సీఎస్ఐ సంఘ పెద్దలు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఆరుపళ్ల విభాగం పాలబండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలను డాక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. పోటీలలో 16 జతల వృషభాలు పోటీపడ్డాయి. కర్నూలు మండలం పి.రుద్రవరం గ్రామానికి చెందిన గోపాల్‌గౌడ్ వృషభాలు మొదటి బహుమతి రూ.40వేలు, వెల్దుర్తి మండలం కలుగోట్ల గ్రామానికి చెందిన రమేష్‌నాయుడు ఎద్దులు రెండో బహుమతి రూ.30 వేలు గెలుచుకున్నాయి. వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం, దాసరిపల్లె గ్రామానికి చెందిన భోగాది సుదర్శన్, రుద్రవరం మండలం అప్పనపల్లె గ్రామానికి చెందిన షేక్ అల్లబకాష్‌ల వృషభాలు మూడవ బహుమతి రూ.20 వేలు, బండి ఆత్మకూరు మండలం ఏ.కోడూరు గ్రామానికి చెందిన చాగంటి నాగమోహన్ రెడ్డి ఎద్లు నాల్గవ బహుమతి రూ.10వేలు సొంతం చేసుకున్నాయి. నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామం బత్తుల జనార్దన్, అయిజ మండలం జరదొడ్డి గ్రామానికి చెందిన జానకి రాముడు వృషభాలు ఐదవ బహుమతి రూ.5వేలు, కోడుమూరు మండలం వెంకటగిరి నాటూరి నారాయణమ్మ ఎద్దులు ఆరవ బహుమతి రూ.4 వేలు సొంతం చేసుకున్నాయి.

మహానందిలో 9న ఉగాది ఉత్సవాలు

మహానంది: మహానంది ఆలయంలో ఈ నెల 9వ తేదీన ఉగాది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మహానంది దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందించిన శ్రీ క్రోధినామ సంవత్సర పంచాంగం పుస్తకాలను ఆవిష్కరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీటీడీ ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మశ్రీ తంగిరాల వెంకటకృష్ణ ప్రపూర్ణ సిద్ధాంతి చేత పంచాంగం రాయించామన్నారు. పండుగలు, వారోత్సవ, మాసోత్సవ, తదితర పంచాంగాలను వేదపండితులు బ్రహ్మశ్రీ రవిశంకర అవధాని నిర్ణయించారన్నారు. దేవస్థానంలోని పబ్లికేషన్ కౌంటర్‌లో భక్తులకు పంచాంగం పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు.

వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు టీడీపీ కుట్ర


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకే తెలుగుదేశం పార్టీ కుట్ర పన్నిందని, వలంటీర్ వ్యవస్థ లేకపోతే పింఛన్ల పంపిణీలో తీవ్ర ఇబ్బంది నెలకొంటుందని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో 6వ వార్డులో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు మహిళలు హారతులు పట్టి తిలకం దిద్ది స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీ తెల్లవారుజాము నుంచే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తున్నారని గుర్తు చేశారు. దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులకు 1వ తేదీ పింఛన్ రాకపోతే ఎంతో ఇబ్బంది పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్లను విధులకు దూరం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకం నేరుగా లబ్ధిదారులకు చేరాలన్న ఉద్దేశంతోనే జగనన్న ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థను టీడీపీ అడ్డుకుంటుందన్నారు. ఇలాంటి కుతంత్రాలకు పాల్పడుతున్న ఆ పార్టీని మళ్లీ ఇంటికే పరిమితం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జగజ్జననీ ఆలయ, గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌన్సిలర్ పురందర్, మాజీ కౌన్సిలర్ భీమునిపల్లి సుబ్బయ్య, అబ్దుల్‌కలాం, పడకండ్ల సుబ్రహ్మణ్యం, భరత్, దేశం సుధాకర్‌రెడ్డి, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాల్లో రాజకీయ కార్యక్రమాలు చేపట్టరాదు

నంద్యాల: క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని గ్రామ పరిధిలోని దేవాలయాల్లో జరిగే ఉగాది ఉత్సవాల్లో ఎలాంటి రాజకీయ ఉపన్యాసాలు, కార్యక్రమాలు నిర్వహించకుండా ఎన్నికల నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి దేవదాయ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఉగాది ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, డీఆర్‌ఓ పద్మజ, నందవరం చౌడేశ్వరి దేవస్థానం ఈఓ కామేశ్వరి పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ గ్రామ పరిధిలోని దేవాలయాల్లో జరిగే సంప్రదాయ ఉత్సవాలన్నీ కోడ్‌ను అనుసరించే జరిపించాలన్నారు. కేవలం ఆధ్యాత్మిక, సంప్రదాయ కార్యక్రమాలు మాత్రమే నిర్వహించాలని చెప్పారు. క్రీడా, బండలాగుడు, ఇతర పోటీలు నిర్వహించరాదని సూచించారు.

చౌడేశ్వరి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి..

నందవరం చౌడేశ్వరి ఆలయంలో జరిగే ఉగాది ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని దేవస్థాన ఈఓ కామేశ్వరికి సూచించారు. బనగానపల్లె సిబ్బందిని కేటాయించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. వేసవి దృష్ట్యా భక్తులకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని చెప్పారు. నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూసుకోవాలన్నారు. దాదాపు లక్ష మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో ఆ మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు.

బంగారు ఉంగరం అప్పగింత

మహానంది: గిద్దలూరుకు చెందిన శివకుమార్, కుటుంబ సభ్యులు సోమవారం మహానందికి వచ్చారు. కోనేరులో స్నానాలు ఆచరిస్తుండగా శివకుమార్ ఉంగరం పడిపోయింది. బయటికి వచ్చిన భక్తులు చూసుకుని ఉంగరం పోయిన విషయం గుర్తించారు. వెంటనే వారు దేవస్థానం ఉద్యోగుల దృష్టికి తీసుకురాగా ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వెతికించి అప్పగించారు. దీంతో బాధిత భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.


ఆర్.పాంపల్లెలో నీటితో నిండుగా కుంట ఏర్పాటు చేసిన మోటార్, పైపులైన్


ఆర్.పాంపల్లెలో ఇంటి వద్దే కుళాయి నీటిని పట్టుకుంటున్న మహిళలు

నీటి సమస్యకు పరిష్కారం

ఉయ్యాలవాడ : వర్షాభావ పరిస్థితులు నెలకొనంతో వేసవిలో నీటి ఎద్దడి ఇబ్బందులు తప్పవని గమనించి ముందు చూపుతో గ్రామస్తులు స్పందించారు. మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో సమీపంలోనున్న కుంటను గత ఏడాది నవంబర్ నెలలో కేసీ కెనాల్ నీటితో నింపుకున్నారు. అలాగే ప్రత్యేక పైపులైన్ ఏర్పాటుకు అధికారులను కోరగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మండల పరిషత్ నిధుల నుంచి రూ. 3.40 లక్షలు వ్యయం చేసి విద్యుత్ మోటార్, కుంట నుంచి గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు వరకు పైపులైన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ట్యాంకును నీటితో నింపి గ్రామంలో కుళాయిలకు సరఫరా చేస్తున్నామని ఏఈ ఫణీత్‌కృష్ణ సోమవారం తెలిపారు. ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ చొరవతో నిధులు మంజూరు చేయడంపై గ్రామ సర్పంచ్ చాబోలు లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు కపురం శివమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

వడగాడ్పులపై ప్రజలకు తెలియజేయండి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

నంద్యాల: వడగాడ్పులపై ప్రజలకు ముందుగానే తెలియజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి పింఛన్ల పంపిణీ, వడగాడ్పులపై తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందుకు జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈనెల 3వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాలు ఇతర ఉద్యోగుల ద్వారా పింఛన్ల పంపిణీకి సంబంధించి సవరించిన మార్గదర్శకాలను రాత్రికి జారీ చేస్తామని స్పష్టం చేశారు. పింఛన్లు ఎలా పంపిణీ చేయాలనే దానిపై అధికారుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించండి

రోజురోజుకు వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉంటూ స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వడదెబ్బ నివారణ చర్యలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, డీఆర్‌ఓ పద్మజ తదితరులు పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో మున్సిపాలిటీల్లోని ప్రధాన కూడళ్లలో, ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్న ప్రదేశాల్లో చలువ పందిళ్లు వేయాలని ఆదేశించారు. అలాగే గుర్తించిన ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆకస్మాత్తుగా వడదెబ్బకు గురైన బాధితులకు అత్యవసర వైద్యం అందించేందుకు పట్టణంలో ప్రధాన కూడళ్లలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వడదెబ్బకు గురైన వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి అత్యవసర మెడిసిన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనుల ప్రదేశాల్లో షెడ్ నెట్స్, తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. గ్రామాలలో తాగునీటికి ఇబ్బంది ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. అలాగే గ్రామాల్లో విద్యుత్ కోతలు ఉండరాదన్నారు.

కొత్తపల్లెను కొత్తపుంతలు తొక్కిస్తా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): మండలంలోని ఎస్.కొత్తపల్లెను అభివృద్ధిలో కొత్తపుంతలు తొక్కిస్తానని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా కోర్టులకు వెళ్లి స్టే ఆర్డర్లు తేవడం టీడీపీ నాయకులకు అలవాటుగా మారిందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో రెండేళ్లు కరోనాతో అభివృద్ధి పనులు నిలిచిపోగా ఓ ఏడాది అభివృద్ధిని టీడీపీ నాయకులు అడ్డుకున్నారని, మిగిలిన రెండేళ్లలోనే రూ.5.30కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సోమవారం ఎస్.కొత్తపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మరింత అభివృద్ధి కోసం అవసరమైతే గ్రామాన్ని దత్తత తీసుకుంటానని చెప్పారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వలంటరీ వ్యవస్థపై కక్ష కట్టి నేడు పింఛన్లు రాకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు తాడి నరేంద్రారెడ్డి, బాలవెంకటరెడ్డి, ఎంపీటీసీ హరినాథరెడ్డి, వైస్ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, తాతిరెడ్డి భాస్కరరెడ్డి, తాతిరెడ్డి సూర్యచంద్రారెడ్డి, బ్రహ్మయ్య, రాజు, ఎంపీపీ ప్రభాకర్, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్ విజయశేఖర్‌రెడ్డి, దేశం సుధాకర్‌రెడ్డి, బొజ్జా శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోడ్‌పై వ్యాపారులకు అవగాహన కల్పించండి

నంద్యాల(వ్యవసాయం): ఎన్నికల నియమావళిపై వ్యాపారులకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అధికారులను కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నత అధికారులను కలిసి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పై వ్యాపారులకు అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అయితే మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌లో ఉన్న అంశాలపై వ్యాపారులకు సరైన అవగాహన లేకపోవడంతో వారిలో ఆందోళనకర పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నికల అధికారులు రెండు రోజుల క్రితం పట్టణంలో వ్యాపారులపై దాడులు నిర్వహించి డబ్బులు సీజ్ చేశారని, దీనిపై వారు ధర్నాకు దిగారని, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పై అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. 95 శాతం పైగా వ్యాపారులు రాజకీయాలకు సంబంధం లేకుండా వ్యాపారం చేసుకునే వారని, వారికి కోడ్‌పై అవగాహన లేదని, నిబంధనల ప్రకారం వ్యాపారం ఎలా చేసుకోవాలి, ఎలాంటి పత్రాలు ఉంచుకోవాలి తదితర అంశాలపై అనేక సందేహాలున్నాయని, వాటిని నివృత్తి చేయాలని అధికారులను కోరామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, దేశం సుధాకర్‌రెడ్డి, వ్యాపార సంఘాల నాయకులు భవనాశి వాసు, మహేష్, అడ్డగాళ్ల మల్లికార్జున, సుబ్బరామయ్య, రామశేషు పాల్గొన్నారు.

